

**పరిగి ఉప్పొంగిన ప్రజాభిమానం:** బుధవారం పరిగి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు, చుట్టుపక్కల డాబాలపైకి ఎక్కి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆలకిస్తున్న అభిమానులు

# గర్జించిన కొడంగల్.. ఉప్పొంగిన పాలమూరు

## పిడికిలెత్తిన పరిగి.. తాండూరు జనతాండవం

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు విజయవంతం

- జననేత, సీఎం కేసీఆర్‌కు వెల్లువలా ప్రజామద్దతు
- పథకాలు, హామీలకు ఆనందంతో హర్షాతిరేకం
- కళాకారుల ఆటపాటలకు గంతులేసిన శ్రేణులు

మహబూబ్‌నగర్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/వికారాబాద్: కొడంగల్ గర్జించింది, పాలమూరు పరవశమైంది. పరిగి పిడికిలెత్తి నినదించగా, తాండూరు తాండవమాడింది.. ఆయా చోట్ల జరిగిన సీఎం కేసీఆర్, జననేత కేసీఆర్ పాల్గొన్న ప్రజాఆశీర్వాద సభలు విజయవంతం అయ్యాయి. ఆయా సభలకు జనం వెల్లువలా తరలివచ్చారు. ఎక్కడికక్కడ గులాబీ జెండా రెపరెపలతో జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలు మిన్నంటాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో, పరిగి, తాండూరు పట్టణాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు పట్నం నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన సభలకు జనం పోటెత్తారు. కోస్గిలోని వేంకటేశ్వర ఫంక్షన్‌హాలు పక్కనున్న గ్రౌండ్‌లో, పరిగి జింఖానా గ్రౌండ్‌లో, తాండూరులోని విలియం మూన్ గ్రౌండ్‌లో ఆయా సభలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల్లోని గ్రామగ్రామాల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలతో సభా ప్రాంగణాలు జనజాతరను తలపించాయి. సీఎం కేసీఆర్ ప్రసంగ సమయాల్లో ప్రజలు, గులాబీ శ్రేణులు ఈలలు, కేరింతలతో సందడి చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున జనం హాజరవడంతో పాలమూరు పట్టణమంతా జనసంద్రమైంది. సభా ప్రాంగణమైన బాలుర కళాశాల మైదానం కిక్కిరిసిపోయింది. సామెతలు, చలోక్తులతో సీఎం కేసీఆర్ కొడంగల్ సహా ఇతర సభలను రక్తి కట్టించారు. తద్దినం ఉన్నదని భోజనం పెడితే మీ ఇంట్లో రోజు ఇట్లే జరగాలి అని, ఎందుకు పుట్టిన వ్‌రా వంకరా.. అంటే సక్కగా ఉన్నోడిని వెక్కిరించనికే.. అన్న సామెతలతో కాంగ్రెస్‌ను, ఆ పార్టీ నేతలను కేసీఆర్ విమర్శించడంతో జనం చప్పట్లతో కేరింతలు కొట్టారు. సభల్లో మిట్టపల్లి సురేందర్ కళాకరుల బృందాల ఆటపాటలతో జనం గంతులేసి ఆడిపాడారు.



**పాలమూరు జనసంద్రం:** బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చిన ప్రజలు

# బీఆర్ఎస్‌లో హ్యాట్రిక్ మంత్ర

## మూడోసారి కేసీఆరే ముఖ్యమంత్రి

- ఊరూరా రగిలిన ఉద్యమస్ఫూర్తి
- కదనరంగంలో గులాబీ శ్రేణులు
- ప్రజలతో పార్టీ అభ్యర్థుల మమేకం
- విస్తృతస్థాయిలో కార్యాచరణ అమలు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'ప్రజల మనసు గెలిచి తీరాల్సిందే.. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాల్సిందే.. ఇదీ బీఆర్ఎస్ శ్రేణుల్లో రగిలిన ఉద్యమస్ఫూర్తి. ఈ హ్యాట్రిక్ మంత్రతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఊరూరా విస్తృత కార్యాచరణను అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు భేషజాలను పక్కనబెట్టి ఎన్నికల ప్రచార కదనరంగంలో ముందుకు సాగుతున్నారు. ఎక్కడికక్కడ కథానాయకులై కదులుతున్నారు. విద్యార్థి, యువజన, రైతు, మహిళా, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ సహా సమస్త బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు ప్రజలతో మమేకం అవుతున్నారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో అన్ని నియోజకవర్గాలు ఎన్నికల ప్రచార కోలాహలాన్ని తారాస్థాయికి చేర్చుతున్నాయి. వీటికి కొనసాగింపుగా పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఎవరికి వారు తామే అభ్యర్థులం అన్నట్టుగా ప్రచార రంగంలోకి దూసుకుపోతున్నారు. అన్నివర్గాల ప్రజలను కలిసి గడచిన తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటా వివరిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటెయ్యాలో విద్యార్థులు, యువకులు, మహిళలు వినూత్న ప్రచారంతో ప్రతి మనిషికి అవగాహన కల్పిస్తున్నారు.



### ప్రజల మనసులు గెలుస్తున్న అభ్యర్థులు

'మేము ఎన్నికలప్పుడే మీ దగ్గరికి వచ్చేవాళ్లం కాదు. మీ రెక్కళ్ల బొక్కల పెరిగినోళ్లం. మీ కష్టసుఖాల్లో భాగమైనోళ్లం.. మరోసారి మమ్మల్ని ఆశీర్వదించండి' అంటూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ప్రజల మనసులు గెలుస్తున్నారు. నియోజకవర్గం అంతా కలియతిరుగుతూ, అన్ని వర్గాలను పేరుపేరునా పలకరిస్తున్న తీరుకు ప్రజలు ముచ్చపడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు తమ వాడకు, తమ ఇండ్లకు వస్తున్నప్పుడు మంగళహారతులు పట్టి ఊరూరా ప్రజలు స్వాగతిస్తున్నారు. 'ఇన్ని చేసిండ్లు ఇన్నేండ్లు మాతోనే ఉన్నరు. ఓట్లప్పుడు వచ్చిపోయేవాళ్లను మేమెందుకు పట్టించుకుంటాం' అని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు భరోసా ఇస్తూ అన్నివర్గాల ప్రజలు ఆశీర్వదిస్తున్నారు. మంత్రులు వారు పోటీచేస్తున్న నియోజకవర్గాలతోపాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని నియోజకవర్గాల్లోనూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

### ఉధృతంగా ఇంటింటి ప్రచారం

ఎన్నికల ప్రచారానికి ఈ నెల 28వ తేదీ తుదిగడువు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాలు ముమ్మరమయ్యాయి. ఈ తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రొగ్రెస్ కార్డు రూపంలో కరపత్రాలు పంచుతూ ఇంటింటికీ తిరుగుతున్నారు. మనిషి మనిషిని కలుస్తున్నారు. నియోజకవర్గంలో వివిధ వర్గాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులను నేరుగా కలుసుకుంటున్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించిన ఆసరా పథకాలను కండ్లకు కట్టినట్టు వివరిస్తున్నారు. నియోజకవర్గంలో స్థానికంగా వివిధ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను ఉదాహరణగా చూపుతూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కొన్నిచోట్ల వినూత్నంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

## పాపాలకు గాంధీ కుటుంబం ఫలితం అనుభవించాల్సిందే

- బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ, నవంబర్ 22: నేషనల్ హెరాల్డ్ ఆస్తులను ఈడీ సీజ్ చేయడంపై బీజేపీ స్పందించింది. తమ పాపాలకు గాంధీ కుటుంబం తగిన ఫలితం అనుభవించాల్సిందేనని పేర్కొన్నది. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ ఆస్తులను గాంధీ కుటుంబం అక్రమంగా స్వాధీనం చేసుకొన్నదని ఆరోపించారు. ఆ వార్తాపత్రికకు చాలా నగరాల్లో విలువైన ఆస్తులు ఉన్నాయని, కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్ గాంధీలు వాటిని అక్రమ మార్గంలో చేజిక్కించుకొన్నారని అన్నారు. సంస్థకు చెందిన షేర్లను సోనియా, రాహుల్‌ల నియంత్రణలోని కంపెనీకి బదలాయించారని ఆరోపించారు.

# దురుద్దేశంతో బదిలీ చేశారు!

- మాజీ సీజేఐ దీపక్ మిశ్రాపై అలహాబాద్ హైకోర్టు సీజే ప్రీతింకర్ తీవ్ర ఆరోపణలు

ప్రయాగ్‌రాజ్ (యూపీ), నవంబర్ 22: పదవీ విరమణ వీడ్కోలు సందర్భంగా అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రీతింకర్ దివాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2018లో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని కొలీజియం వేధింపులలో భాగంగానే తనను ఛత్తీస్‌గఢ్ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసినట్టు ఆయన ఆరోపించారు. 2018 నుంచి హైకోర్టులో జడ్జీగా పనిచేస్తుండగా ఈ ఏడాది సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం తనను అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా సిఫార్సు చేసిందన్నారు. దీంతో తాను ఈ ఏడాది మార్చిలో ఆ ఉన్నత పదవిని చేపట్టానంటూ చంద్రచూడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

